# తొందర పాటు తగదు



*అసారేఖలు సంసారే*
*సారం శ్వశుర మందిరం*
*హిమాలయే హర శ్శేతే*
*హరిశ్శేతే మహోదధౌ*

*భావం:* నిస్సారమైన సంసారంలో మామగారిల్లు మాత్రమే సారం కలది. అందుకే కాబోలు శివుడు (పార్వతి పుట్టిల్లయిన) హిమాలయాలలో ఉంటాడు. విష్ణువు (లక్ష్మి పుట్టిల్లయిన) సముద్రంలో ఉంటాడు.

భారవి మహాకవి. చిన్నతనంనుంచీ అతని ప్రజ్ఞాపాటవాలనూ, విద్యనూ కవిత్వాన్నీ అందరూ మెచ్చుకునేవారు. ఆ మెచ్చుకునే వారితో అతని తండ్రి కొడుకుని తీసిపారేసినట్లు మాట్లాడేవాడు. ఆ విషయం భారవి మనస్సుకి కష్టం కలిగించేది. ఒకనాడతడు అందంగా అల్లిన శ్లోకాన్ని అందరూ అభినందిస్తుండగా తండ్రి నోరు చప్పరించాడు.

భారవికి చాలా కోపం వచ్చింది. ఒక పెద్ద బండరాయి తీసుకుని భోజనాల గదిలో అటక మీద కూచున్నాడు. తండ్రి వచ్చి భోజనానికి కూచున్నప్పుడు రాయిని అతని నెత్తిపై పడవేసి చంపెయ్యాలని భారవి కోరిక. తండ్రి భోజనానికి కూచున్నాడు. తల్లి వడ్డిస్తూ "అందరూ అబ్బాయిని అభినందిస్తుండగా మీరు మాత్రం తక్కువ చేస్తూ మాట్లాడుతారేమిటి? వాడి మనస్సు నొచ్చుకుంటోంది" అంది.

తండ్రి " నా కుమారుడు ప్రతిభాశాలి అని నాకు తెలిసినంతగా ఎవరికీ తెలియదు. కానీ నేనే మెచ్చుకుంటే వాడికి గర్వం కలిగి ఉన్నత శిఖరారోహణ నిలిపివేస్తాడని నా భయం." అన్నాడు. భారవికి తన తప్పు తెలిసింది. క్రిందకి దిగి వచ్చి తండ్రి కాళ్ళు పట్టుకున్నాడు. తండ్రి మన్నించాడు. భారవి "కేవలం క్షమించడం కాదు శిక్ష వెయ్యమ"న్నాడు. తండ్రి ఫరవాలేదన్నాడు. భారవి బలవంతం చేస్తే ఆరు నెలలు అత్తవారింటిలో ఉండి రమ్మన్నాడు.

భారవికి అందులో శిక్ష కన్పించలేదు. "సాక్షాత్తు హరిహరులే అత్తవారిళ్ళల్లో ఉంటున్నారు. ఇందులో కష్టమేముంది." అంటూ భార్యా సమేతంగా అత్తవారింటికి వెళ్ళాడు. కూతుర్నీ అల్లుణ్ణీ చూడగానే అత్తవారింట్లో అందరూ మురిసిపోయారు. సంపెంగ నూనెతో, కస్తూరి నలుగుతో, పన్నీటి జలాలతో అభ్యంగన స్నానాలు, పంచభక్ష్య పరమాన్నాలతో భోజనాలు వారంపదిరోజులు గడిచిపోయాయి. అత్తవారింట్లో మర్యాదలు తగ్గాయి. నూతి దగ్గర స్నానం, మామూలుభోజనం, నెల రోజులు గడిచిపోయాయి. భారవికి పొలం కాపలా పని అప్పగించారు. తండ్రి విధించిన శిక్ష తెలియవచ్చింది.

పండుగలు వచ్చాయి. అందరూ చీరలూ, నగలూ కొనుక్కుంటున్నారు. భారవి భార్య భర్తను డబ్బు అడిగింది. చేతిలో చిల్లిగవ్వ లేదు. తండ్రి విషయంలో తన తొందరపాటు గుర్తొంచింది. " ఏ పనీ వెంటనే చెయ్యరాదు." అనే అర్థంలో శ్లోకంలో రాసి ఆ ఊరి వర్తకునికి ఇచ్చి అతనిచ్చిన ధనంతో చీరలూ, నగలూ, భార్యకు కొనిచ్చాడు. ఆరునెలలు పూర్తయ్యాయి. హాయిగా ఇంటికి వచ్చేసి కిరాతార్జునీయం వ్రాసి తల్లితండ్రులతో పేరుప్రఖ్యాతులతో సుఖంగా ఉన్నాడు.

భారవి వద్ద పద్యం కొన్న వర్తకుడు విదేశీ వ్యాపారానికి వెళ్ళాడు. ఏళ్ళ తరబడి వర్తకం చేసి లాభాలతో ఒక రాత్రికి తిరిగి వచ్చాడు. భార్య పక్కన పరపురుషుడు నిద్రిస్తున్నాడు. మంచి యువకుడు కూడా, వెంటనే కత్తి తీసి చంపాలనుకుని గోడ మీద ఉన్న ఒరలో ఉన్న కత్తి లాగాడు. కత్తితో పాటు బయటకు వచ్చిన తాటాకు పై ఏ పనీ వెంటనే చెయ్యొద్దని ఉంది. వర్తకుడు రాత్రికి ఊరుకున్నాడు. మర్నాడు ఆ యువకుడు కొడుకని తెలిసింది. తొందరపడి భార్యాబిడ్డలను చంపి హంతకుడిగా మారి పాపం మూట కట్టుకునే వాణ్ణి కదా అని అనుకున్నాడు. పద్యం వ్రాసిన భారవి దగ్గరకు వచ్చి నమస్కరించి సన్మానించాడు.

భారవితండ్రి ప్రవర్తనను నేటి మానసిక శాస్త్రవేత్తలు ఒప్పుకోరు. మెచ్చుకుంటేనే పిల్లలు పైకి వస్తారని వారి నమ్మకం. ఆ నమ్మకం వమ్ము చెయ్యడానికే భారవి పంచ కావ్యాలలో ఒకటైన కిరాతార్జునీయం వ్రాశాడేమో. ఆ విషయం ఎలా ఉన్నా ఏ పని లోనూ తొందరపాటు తగదన్నది మాత్రం సార్వజనీనకమైన సార్వకాలీనమైన సత్యం.

******